RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

## రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు



వివరాలు 3లో

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.


సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి | సంపుటి:3 | సంచిక : 198 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | సోమవారం 15 జూన్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన

- మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన
- ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
- దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు



**ఫ్రాన్స్:** ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో మిగతా 2లో...



## సింగపూర్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

**సింగపూర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల (జూన్ 15, 16) పర్యటన నిమిత్తం సింగపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు) ఆయనకు అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు రాక గురించి తెలుసుకున్న తెలుగు ఎన్ఆర్ఐలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. ముఖ్యమంత్రి పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ సందడి చేశారు. వారి ఆప్యాయతకు స్పందించిన చంద్రబాబు, ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, వారితో కలిసి ఫోటోలు మిగతా 2లో...



## అమరావతి పనులు జోరుగా సాగుతున్నాయి: మంత్రి లోకేశ్

అమరావతి (సింధూర దర్శిని) 14 జూన్: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగి పోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా మిగతా 2లో...

## లండన్‌లో భారతీయుడి దారుణ హత్య




**ఢిల్లీ :** వెస్ట్ లండన్‌లోని సౌత్ హాల్ ప్రాంతంలో భారతీయ సంతతికి చెందిన 26 ఏళ్ల గుర్బేజ్ సింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. జూన్ 11 అర్ధరాత్రి నార్త్ రోడ్--డార్మర్స్ వెల్స్ లేన్ జంక్షన్ వద్ద గుర్తుతెలియని దుండగులు అతనిపై కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాల పాలైన గుర్బేజ్ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందాడు. ఈ ఘటనలో మిగతా 2లో...

## కమ్యూనిస్టులకు-కౌగిలింతలు' అక్కర్లేదు : బృందాకారత్



**త్రిస్సూర్ :** కమ్యూనిస్టులకు -కౌగిలింతలు' అక్కరలేదని, స్వచ్ఛమైన రాజకీయాలు కావాలని సిపిఐ(ఎం) నేత బృందాకారత్ పేర్కొన్నారు. కేరళం మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం)సీనియర్ నేత పినరయి విజయన్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆమె మిగతా 2లో...

## దేశ సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను దిగజార్చిన మోడీ ప్రభుత్వం : ఖర్గే



**న్యూఢిల్లీ :** దేశ సార్వభౌమాధికారాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను మోదీ ప్రభుత్వం దిగజార్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఒమన్ తీరంలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై ప్రధాని మోడీ మిగతా 2లో...

## మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే: కేటీఆర్

- మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
- ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు



హైదరాబాద్ (సింధూర దర్శిని) 14 జూన్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో మిగతా 2లో...

## భారతీయ నావికుల మృతి: ఈ బలహీన ప్రధాని దేశాన్ని కాపాడలేరంటూ రాహుల్ గాంధీ ఫైర్

- హర్మూజ్ జలసంధిలో భారత నావికుల మృతిపై మోదీ సర్కార్‌ను నిలదీసిన రాహుల్ గాంధీ
- అమెరికాకు ప్రభుత్వం దాసోహం అంటోందని తీవ్ర విమర్శలు
- ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్




**ఢిల్లీ :** హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా మిగతా 2లో...

## మమతా బెనర్జీకి రెబల్ ఎంపి కుమారుడు నోటీసులు



**కోల్‌కతా :** రెబల్ టిఎంసి ఎంపి కకోలీ ఘోష్ కుమారుడు వైద్యనాథ్ ఘోష్ దస్తీదార్ పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు టిఎంసి నేతలకు లీగల్ నోటీసులు పంపారు. బరాసత్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ టికెట్ ఆశించారన్న ఆరోపణలను ఖండిస్తూ మమతా బెనర్జీ సహా మహువా మొయిత్రా, కళ్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, నాలి గుహ వంటి పలువురు నేతలకు నోటీసులు పంపినట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. 15 రోజుల్లోగా బహిరంగ వివరణ, క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో కోరారు. తాను బరసత్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎలాంటి నామినేషన్ కోరలేదని, ఆశించలేదని, తనకు ఎటువంటి రాజకీయ ఆశయం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన టిఎంసిలో అంతర్గత విబేధాలు పెచ్చుమీరిన సంగతి తెలిసిందే. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీ వ్యవహారాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎంపిలు, ప్రజా ప్రతినిధులు బహిరంగంగా తిరుగుబాటు ప్రకటిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం మిగతా 2లో...



## దక్షిణ బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

**బీరుట్ :** లెబనాన్ రాజధాని బీరుట్‌లోని దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయిల్ సేనలు ఆదివారం బాంబు దాడులు జరిపాయి. ఓ భవనంపై జరిగిన దాడిలో ఇద్దరు చనిపోగా నలుగురు గాయపడ్డారు. బీరుట్‌లో షియాలు అధికంగా నివసిస్తున్న దహియెం?ప్రాంతంపై ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. ఆ ప్రాంతం జనసమ్మర్దంగా ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలు ఎక్కువగా ఉంటాయి. దహియెం?లోని హిజ్బుల్లా కమాండ్ కేంద్రంపై దాడి చేశానని ఇజ్రాయిల్ సైన్యం మిగతా 2లో...

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం



- బావిలో వ్యాన్ పడి 8 మంది మృతి
- మరో ఆరుగురికి గాయాలు

**పుణే :** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోలాపుర్? జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్? అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు పిల్లలు ఉన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోలాపూర్ జిల్లాలోని మస్వద్ సిద్ధనాథ్ ఆలయాన్ని సందర్శించడానికి పంధర్‌పూర్‌కు చెందిన కొందరు ఒక వ్యాన్‌లో మిగతా 2లో...

## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

## అమరావతి పనులు జోరుగా సాగుతున్నాయి: మంత్రి లోకేశ్

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. రాజధానిలో ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదారులు, రిజర్వాయర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న టవర్లు, మంత్రుల బంగ్లాల నిర్మాణాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఇకనైనా విష ప్రచారాన్ని ఆపండి" అని చెప్పిన ఓ వీడియోను మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను వీడియో రూపంలో ప్రజల ముందు ఉంచి, అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి మంత్రి లోకేశ్ గట్టిగా బదులిచ్చారు.

## లండన్‌లో భారతీయుడి దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

మరో వ్యక్తి గాయపడగా చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. అక్కడి పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, సాక్షుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.

## కమ్యూనిస్టులకు-కౌగిలింతలు' అక్కర్లేదు : బృందాకారత్

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా తప్పు పట్టారు. శనివారం ఆమె జాతీయ మీడియాతో మాట్లాడారు. తమకు ఎవరి నుండి ఎటువంటి కౌగిలింతలు అవసరం లేదని, కమ్యూనిస్టులు కౌగిలింతలను కోరుకోరని అన్నారు. తాము నిబద్ధత కలిగిన రాజకీయాలను కోరుకుంటామని అన్నారు. ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసేందుకు బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నాయని మండిపడ్డారు. కానీ రాహుల్ గాంధీ కేరళంకు వచ్చి, రాజకీయం పేరిట అత్యంత గౌరవనీయులైన నేత పినరయి విజయన్ పై దాడి చేస్తారని, తిరిగి బిజెపి-ఆర్ ఎస్ ఎస్ కు వ్యతిరేకంగా అన్నీ పార్టీలు ఐక్యం కావాలని కోరుకుంటారని అన్నారు. ఇది పూర్తిగా ద్వంద్వ ప్రమాణమని మండిపడ్డారు. "రాహుల్ గాంధీజీ .. మీ కౌగిలింతలు మీ దగ్గరే ఉంచుకోండి. కానీ ప్రతిపక్ష నాయకుడిగా, బిజెపి -ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా తమ జీవితంలో అధిక భాగం కార్మిక వర్గం కోసం పోరాడిన పినరయి విజయన్ వంటి ప్రతిపక్ష నేతలను గౌరవించండి" అని రాహుల్ గాంధీకి హితవు పలికారు.

## దక్షిణ బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఇజ్రాయిల్ దళాలు కాల్పుల విరమణను ఉల్లంఘించినందుకు ప్రతిగా మజ్దల్ జౌన్ పట్టణ శివారు ప్రాంతంలో వాహనాలు, సైనికులను లక్ష్యంగా చేసుకొని రాకెట్ దాడులు చేశామని హిజ్బుల్లా తెలిపింది.

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ

అమరావతి (సింధూర దర్శిని) 14 జూన్: వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకట నలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజా స్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపి వేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు.

# సింగపూర్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం





(మొదటిపేజీ తరువాయి)

దిగారు. ఈ సందర్భంగా చంద్రబాబు తనను కలవడానికి వచ్చిన తెలుగు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. "నాకు, నా బృందానికి ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు మీ కుటుంబాలతో కలిసి వచ్చి చూపిన ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. మీ అందరితో మాట్లాడటం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. మీలో ప్రతి ఒక్కరి మద్దతును ఎప్పటికీ మరువలేను" అని చంద్రబాబు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు సింగపూర్‌లో జరగనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొననున్నారు.





## పాపికొండల విహారయాత్ర నిలిపివేత



అమరావతి ( సింధూర దర్శిని) 14 జూన్ : నేటి నుంచి పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. గోదావరిలో పర్యాటక బోట్ల నిర్వహణపై భద్రతపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో .... ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాగా, జూన్ 12న, 89 మంది ప్రయాణికులతో వెళుతున్న ఒక ప్రైవేట్ పర్యాటక పడవలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది దేవిపట్నం సమీపంలో గోదావరి నది మధ్యలో నిలిచిపోయింది. ప్రయాణికులను సురక్షితంగా తరలించినప్పటికీ, అధికారులు పడవను తనిఖీ చేయడానికి వెంటనే కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీల ప్రక్రియను ముమ్మరం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. కునవరం నుండి (తెలంగాణలోని భద్రాచలం మీదుగా) పాపికొండ కొండ శ్రేణిలోకి ప్రవేశించే పడవ సేవలకు ఈ నిలుపుదల వల్ల ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు పేర్కొన్నారు.

## మమతా బెనర్జీకి రెబల్ ఎంపి కుమారుడు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. తన కోసం ఎమ్మెల్యే టికెట్ కోరుతూ తన తల్లి కకోలీ ఘోష్ ఏడ్చారని మహువా మొయిత్రా తప్పుడు ప్రచారం చేశారని" వైద్యనాథ్ ఘోష్ ఎక్స్ లో ఆరోపించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. "నా కోసం ఎమ్మెల్యే టికెట్ కోరుతూ మా అమ్మ ఏడ్చారని మహువా మొయిత్రా అబద్ధం చెప్పారు. ఇది వంద శాతం అబద్ధం. విభేదాలను రాజకీయంగా పరిష్కరించుకోవాలి తప్ప, వ్యక్తిగత వ్యక్తులను లేదా కుటుంబ సభ్యులను వివాదంలోకి లాగకూడదు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కును నేను కలిగి ఉన్నాను," అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. తాను గానీ, తన తల్లి గానీ బసరత్ అసెంబ్లీ టికెట్ కోరలేదని, ఆ ఆరోపణలను తాను ఖండిస్తున్నానని అన్నారు. తన తల్లి మద్యం సేవిస్తున్నారన్న ఆరోపణలను కూడా ఖండిస్తున్నానని మరో పోస్ట్ లో తెలిపారు.
మీడియా ఇంటర్వ్యూలు, బహిరంగ ప్రకటనలతో సహా వివిధ సందర్భాలలో, అతను బసరత్ నుండి రాజకీయ నామినేషన్ కోరాడని సూచిస్తూ అనుమానాలు వ్యక్తం చేశారని, అతని తల్లి అసమ్మతి రాజకీయ వైఖరిని అవలంబించడానికి దారితీసిందని కూడా ఆరోపించారు. "నా క్లయింట్ ఈ ఆరోపణలను ఖచ్చితంగా ఖండిస్తున్నారు. అతను బరసత్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎటువంటి నామినేషన్ కోరలేదని లేదా కోరుకోలేదని, ఆ విషయంలో అతనికి ఎటువంటి రాజకీయ ఆశయం లేదని ఆయన పేర్కొంటున్నారు," అని ఆ నోటీసులో ఉంది. బరసత్ అసెంబ్లీ సెగ్మెంట్ నుండి ఎన్నికలలో పోటీ చేయమని ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్)కి చెందిన ప్రతినిధులు పలుమార్లు తనను సంప్రదించారని కూడా ఆ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. టీఎంసీపీ కార్యకర్త సోహోం పాల్ పలుమార్లు వాట్సాప్ ద్వారా దస్తిదార్‌ను సంప్రదించి, ఎన్నికల్లో పోటీ చేయమని ప్రోత్సహించారని, అలాగే బరసత్‌లో జరిగే ఆరోగ్య శిబిరాలకు హాజరు కావాలని ఆహ్వానించారని కూడా అందులో ప్రస్తావించారు. బరసత్ సీటును తనకు కేటాయించాలని కోరినట్లు టిఎంసి నేతలు చేసిన వాదన "అసత్యం , పరువు నష్టం కలిగించేది" అని పేర్కొంటూ, 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని వైద్యనాథ్ డిమాండ్ చేశారు.

## భారతీయ నావికుల మృతి: ఈ బలహీన ప్రధాని దేశాన్ని కాపాడలేరంటూ రాహుల్ గాంధీ ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. "అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. "అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు" అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం "ఇది సమర్థనీయం కాదు" అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు. మరోవైపు, ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

## మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే: కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ. 4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## దేశ సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను దిగజార్చిన మోడీ ప్రభుత్వం : ఖర్గే

(మొదటిపేజీ తరువాయి)

మౌనం వహించడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు గడిచినా ప్రధాని నుండి కనీసం ఒక సంతాప సందేశం గాని లేదా బహిరంగ ప్రకటన గాని వెలువడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా దాడుల్లో మరణించిన వారి మృతదేహాలు భారత్ కి చేరుకుంటున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఎక్స్ లో ఘాటుగా స్పందించారు. గతంలో అలీన విధానాన్ని అనుసరిస్తూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకున్నప్పుడే భారత్ నిజమైన 'విశ్వగురువు'గా ఉండేదని, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని విమర్శించారు. విదేశాంగ విధానాల విషయంలో భారతీయుల ప్రాణాలను తేలికగా తీసుకోకూడదని, జవాబుదారీతనానికి మౌనం ఎంతమాత్రం ప్రత్యామ్నాయం కాదని ఖర్గే స్పష్టం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని మోడీపై మండిపడ్డారు. అమెరికా దాడుల్లో మన దేశ పౌరులు మరణిస్తే, ఆ దేశాన్ని గట్టిగా నిలదీయాల్సింది పోయి వారి బెదిరింపులకు తలొగ్గుతున్నట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. పౌరులను, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రధాని మోడీ విఫలమయ్యారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారు. ఆలయ సందర్శన అనంతరం తిరిగివెళ్తుండగా..ఆదివారం సాయంత్రం 5:15 గంటల సమయంలో తాండుల్వాడి సమీపాన వారి వ్యాన్ అదుపు తప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. వెంటనే స్పందించిన స్థానికులు సహాయక చర్యలను ప్రారంభించారు. తరువాత పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే 8 మంది చనిపోయారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రులకు తరలించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయిందని, విచారణ కొనసాగుతోందని సోలాపూర్ రూరల్ పోలీస్ సూపరింటెండెంట్ అతుల్ కులకర్ణి తెలిపారు.



# లిక్కర్ స్కామ్‌లో సూత్రధారి జగనే

## - మంత్రి డోలా తీవ్ర ఆరోపణలు

- లిక్కర్ స్కామ్ సూత్రధారి, లబ్ధిదారుడు జగనేనన్న మంత్రి డోలా
- జగన్ పీఏ కేఎన్ఆర్ వందల కోట్లు దోచుకున్నారని ఆరోపణ
- బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా రూ.3,500 కోట్లు దుర్వినియోగం
- ప్రమాదకర రసాయనాలతో 'జె-బ్రాండ్' మద్యం సరఫరా చేశారని విమర్శ

అమరావతి (సింధూర దర్శిని ) 14 జూన్: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో అసలు సూత్రధారి, ప్రధాన లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కేఎన్ఆర్ వందల కోట్లు కొల్లగొట్టారంటే, ఇక జగన్ ప్రమేయం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవ రెడ్డిని నియమించి, ఆ సంస్థ ద్వారా సుమారు రూ.3,500 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన 'జె-బ్రాండ్' మద్యంలో దేశంలో మరెక్కడా లేని విధంగా అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నాయని విమర్శించారు. ఈ కుంభకోణంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, మిథున్ రెడ్డి వంటి వైసీపీ నేతలు ఈడీ విచారణను ఎదుర్కోక తప్పదని డోలా స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం కుంభకోణంపై కేంద్ర ఏజెన్సీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఇటీవల జగన్ మాజీ పీఏ కేఎన్ఆర్ నివాసంలో సిట్ అధికారులు సోదాలు నిర్వహించిన నేపథ్యంలో, మంత్రి డోలా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఉపాధ్యాయుల కృషితోనే చదువులో రాణింపు : విజయ్ దేవరకొండ



బల్మూర్ (సింధూర దర్శిని) 14 జూన్ కర్నూలు జిల్లా: ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు చదువులో రాణిస్తారని సినీ నటుడు విజయ్ దేవర కొండ అన్నారు. ఆదివారం నాగర్ కర్నూలు జిల్లా బల్మూర్ మండల పరిధిలోని తుమ్మనపేట గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 'ద విజయ్ దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్, రష్మిక దంపతులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించారని వారిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లా రెండో స్థానంలో నిలిచిందని, ఇందుకు డీఈవో, ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని అన్నారు. నియోజకవర్గంలోని 45 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులకు నగదు బహు మతి అందించారు. ప్రథమ స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,000, ద్వితీయ స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,000 చొప్పున మొత్తం 181 మంది విద్యార్థులకు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీఈవో రమేష్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు, విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒమన్ తీరంలో భారత్ నౌకకు ప్రమాదం

## 14 మంది సిబ్బంది సురక్షితం



**మస్కట్ :** ఒమన్ తీరంలో భారతీయ జెండాతో ప్రయాణం చేస్తున్న నౌక ప్రమాదానికి గురయింది. ఈ నౌకలో ఉన్న మొత్తం 14 మంది సిబ్బందిని రక్షించారు. ఈ విషయాన్ని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. 'భారత జెండా కలిగిన ఎంఎస్‌వి విరాట్ 1 లో చేపట్టిన సహాయక చర్యలు విజయవంతంగా పూర్తయ్యాయి. నౌకలోని 14 మంది సిబ్బందిని రక్షించారు. సిబ్బంది క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు' రాయబార కార్యాలయం ఒక సోషల్ మీడియా పోస్టులో తెలిపింది. రక్షించిన సిబ్బందిని ముంబయి వెళ్తున్న జబల్ అలీ 9 నౌకలోకి తరలించినట్లు తెలిపింది. ఇంజన్ వైఫల్యంతో ఎంఎస్‌వి విరాట్ 1 ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. విరాట్ 1 50 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు కలిగిన ఒక చిన్న నౌక. పర్షియన్ గల్ఫ్ దేశాలకు పరిమితంగా సామాగ్రిని, త్వరగా పాడైపోయే ఆహార పదార్థాలను తీసుకుని వెళ్లడానికి ఈ మార్గం చిన్న నౌకలు ప్రయాణం చేస్తుంటాయి.

# వైసీపీ హయాంలో సచివాలయ నియామకాల్లో భారీ స్కామ్: టీడీపీ నేత విజయకుమార్



- వైసీపీ హయాంలో గ్రామ సచివాలయ నియామకాల్లో భారీ అవకతవకలు
- అర్హులను కాదని వైసీపీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారన్న టీడీపీ
- ఏపీపీఎస్సీ ఉద్యోగినికే ఫస్ట్ ర్యాంక్ రావడంపై అనుమానాలు
- 90 శాతం పోస్టులు తమ వారికేనన్న విజయసాయి వ్యాఖ్యల ప్రస్తావన

అమరావతి (సింధూర దర్శిని ) 14 జూన్: వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019లో జరిగిన గ్రామ సచివాలయ ఉద్యోగ నియామకాల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి ఛైర్మన్, టీడీపీ నేత నీలాయపాలెం విజయకుమార్ ఆరోపించారు. అర్హులైన నిరుద్యోగ యువతను పక్కనపెట్టి, కేవలం వైసీపీ అనుచరులకే ఉద్యోగాలు కట్టబెట్టారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది అర్హులకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినిగా పనిచేస్తున్న అనితారెడ్డి అనే మహిళ, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 పరీక్షలో 150 మార్కులకు గాను 112.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు ఎలా సాధించారని ఆయన ప్రశ్నించారు. అలాగే, ఆర్ట్స్, సైన్స్ రెండు విభాగాల్లోనూ టాపర్‌గా నిలిచిన దొడ్డ వెంకటరెడ్డికి, ఏపీపీఎస్సీలోని ఓ ఉన్నతాధికారితో ఉన్న సంబంధం ఏమిటని నిలదీశారు. గతంలో 90 శాతం ఉద్యోగాలు తమ కార్యకర్తలకే ఇచ్చామని విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను విజయకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలే అప్పటి వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయని అన్నారు. పారదర్శకత గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న డీఎస్సీ నియామకాలపై వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై బురద జల్లడం మానుకోవాలని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

# కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకు హాజరుకానున్న ప్రకాశ్ రాజ్

- బెంగళూరులో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన
- ఈ కార్యక్రమంలో పాల్గొంటానని వెల్లడించిన ప్రకాశ్ రాజ్
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సీజేపీ డిమాండ్
- నీట్ పేపర్ లీక్, పరీక్షల అవకతవకలపై వెల్లువెత్తిన ఆందోళనలు
- ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాలంటూ ప్రకాశ్ రాజ్ పిలుపు



**బెంగుళూరు:** నీట్-యూజీ 2026 పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో ఆదివారం 'కాక్రోచ్ జనతా పార్టీ' (జజీపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ పాల్గొననున్నారు. యువత చేపట్టిన ఈ నిరసనకు ఆయన మద్దతు ప్రకటించారు.
ఈ నిరసనలో పాల్గొనడంపై ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తేందుకు, ఈ శాంతియుత నిరసనకు మద్దతుగా బెంగళూరు వస్తున్నాను. దయచేసి అందరూ ఇందులో పాల్గొని ప్రభుత్వాన్ని జవాబుదారీ చేద్దాం" అని JustAsking అనే హ్యాష్‌ట్యాగ్‌తో పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శించే ప్రకాశ్ రాజ్, ఈ నిరసనకు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ సమస్యలు, పరీక్షల ఒత్తిడితో విద్యార్థుల ఆత్మహత్యలు వంటి అంశాలపై 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే యువత నేతృత్వంలోని ఉద్యమం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఢిల్లీలోని జంతర్ మంతర్, పుణె, లక్నో, హైదరాబాద్‌లలో నిరసనలు చేపట్టారు. హైదరాబాద్‌లో జరిగిన నిరసనకు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. రాజ్యాంగం, జాతీయ జెండాలను చేతబూని శాంతియుతంగా నిరసన తెలుపుతూ, విద్యావ్యవస్థలోని లోపాలపై ప్రభుత్వాన్ని నిలదీయడమే తమ లక్ష్యమని నిర్వాహకులు చెబుతున్నారు.

# సేఫ్టీ రోప్ లేకుండానే 130 అడుగుల నుంచి తోసేశారు



- బ్రెజిల్‌లో రోప్ జంపింగ్ అడ్వెంచర్ విషాదాంతం
- సేఫ్టీ రోప్ కట్టకుండానే యువతిని కిందకు తోసేసిన నిర్వాహకులు
- 130 అడుగుల ఎత్తు నుంచి పడి 21 ఏళ్ల యువతి అక్కడికక్కడే మృతి
- ఘటనపై ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు.. ముగ్గురిపై హత్యా నేరం నమోదు

**బ్రెజిల్:** అడ్వెంచర్ స్పోర్ట్స్ ఎంత థ్రిల్‌ను ఇస్తాయో, చిన్న పొరపాటు జరిగితే అంతే విషాదాన్ని మిగులుస్తాయని బ్రెజిల్‌లో జరిగిన ఓ ఘటన నిరూపించింది. సాహసం కోసం వెళ్లిన ఓ యువతి, నిర్వాహకుల ఘోర తప్పిదం కారణంగా ప్రాణాలు కోల్పోయింది. సేఫ్టీ రోప్ కట్టకుండానే 21 ఏళ్ల యువతిని 130 అడుగుల ఎత్తైన వంతెన పైనుంచి కిందకు తోసేయడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది.

### అసలేం జరిగిందంటే..!

సావో పాలో రాష్ట్రంలోని లైమీరా నగరంలో ఉన్న 'పొంటె డొ ఎస్కెలెటో' (స్కెలెటన్ బ్రిడ్జ్) వద్ద ఈ దారుణం జరిగింది. మృతురాలిని ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాడ్యుయేట్ అయిన మరియా ఎడుర్డా రోడ్రిగ్స్ డి ఫ్రీటాస్ (21)గా గుర్తించారు. ప్రైవేట్ ఆపరేటర్లు నిర్వహించిన రోప్-జంప్ ఈవెంట్‌లో ఆమె ఉత్సాహంగా పాల్గొంది. నిర్వాహకులు ఆమెను వంతెన అంచుకు తీసుకువచ్చి, కిందకు దూకేందుకు సిద్ధం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సిబ్బంది మరియాను కిందకు తోసేయడం ఈ వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఆమెకు కట్టాల్సిన భద్రతా తాడు కిందనే చుట్టి ఉండటాన్ని గమనించిన అక్కడి వారు 'తాడు.. తాడు కట్టలేదు!' అంటూ గట్టిగా అరిచారు. కానీ, అప్పటికే జరగరాని ఘోరం జరిగిపోయింది. మరియా 130 అడుగుల (40 మీటర్లు) ఎత్తు నుంచి వేగంగా కిందపడి మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పారామెడికల్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. కానీ, మరియా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం లీగల్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. కళ్ల ముందే జరిగిన ఈ విషాదాన్ని చూసి ఆమె కాబోయే భర్త అక్కడే అనారోగ్యానికి గురవడంతో అతడిని ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. మిలిటరీ, సివిల్ పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించి, ఈవెంట్ నిర్వహణతో సంబంధం ఉన్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురిపై ఉద్దేశపూర్వక హత్యా నేరం కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ ఘటన జరిగిన ప్రదేశం ఎలాంటి నియంత్రణలు లేనిదని, ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్ కోసం ఇక్కడకు తరచూ వస్తుంటారని తెలిసింది. ఈ ప్రాంతంలో భద్రతా చర్యలపై మరింత పర్యవేక్షణ, జవాబుదారీతనం అవసరమని లైమీరా మేయర్ మురిలో ఫ్లిక్స్ పేర్కొన్నారు. విషాదం జరగడానికి కొద్దిసేపటి ముందు, మరియా తన ఉత్సాహాన్ని, కొద్దిపాటి ఆందోళనను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం మరింత కలచివేస్తోంది. బ్రెజిల్‌లోని అడ్వెంచర్ టూరిజం రంగంలో భద్రతా ప్రమాణాలపై ఈ ఘటన తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది.

# రెండోసారి సిఐడి విచారణకు హాజరైన అభిషేక్ బెనర్జీ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత నియామకానికి సంబంధించి ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై, టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ రెండోసారి సిఐడి విచారణకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం ఆయన కోల్ కతాలోని సిఐడి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. గతవారం జరిగిన విచారణలో అభిషేక్ బెనర్జీ ఇచ్చిన సమాధానాలపై సిఐడి అధికారులు సంతృప్తి చెందలేదని, అందుకే ఆయనకు మరోసారి సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆదివారం విచారణకు హాజరుకావాల్సిందిగా మరో టిఎంసి ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కు కూడా సిఐడి సమన్లు జారీ చేసిందని, విచారణలో భాగంగా ఇరువురు నేతలను ముఖాముఖీ ప్రశ్నించే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కునాల్ మధ్యాహ్నం 3.00 గంటలకు భబానీ భవన్ లోని సిఐడి విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసుకు సంబంధించి నిర్దిష్ట ప్రతాలను సమర్పించాల్సిందిగా అభిషేక్ బెనర్జీని కోరామని సిఐడి తెలిపింది.

# కృష్ణా నదిలో నాటు పడవ బోల్తా-నలుగురు మృతి



అచ్చంపేట (సింధూర దర్శిని) 14 జూన్: పల్నాడు జిల్లా: ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలోని కోనూరులో ఆదివారం తీవ్ర విషాదం నెలకొంది. కృష్ణా నదిలో ప్రయాణిస్తున్న ఒక నాటు పడవ అకస్మాత్తుగా బోల్తా పడి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28) గా గుర్తించారు.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .... ఒకే కుటుంబానికి చెందిన 10 మంది బంధువులు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామ పరిధిలో జరిగే ఒక శుభకార్యానికి హాజరయ్యారు. వేడుక ముగిసిన అనంతరం వారంతా కలిసి కృష్ణా నది గుండా అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు ఒక చిన్న నాటు పడవపై తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ప్రయాణం మధ్యలో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో పడవ ఒక్కసారిగా అదుపుతప్పి నీటిలో బోల్తా పడింది. పడవ బోల్తా పడటంతో అందులో ఉన్న 10 మంది నీట మునిగిపోయారు. వారి కేకలు విన్న కోనూరు గ్రామస్థులు, మత్స్యకారులు వెంటనే నదిలోకి దూకి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అయితే మిగిలిన నలుగురు నది ఉధృతికి కొట్టుకుపోయారు. నదిలో మునిగిపోయిన నలుగురిని గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), చైతన్య (28)గా గుర్తించారు. స్థానికులు, ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణా నది తీర ప్రాంత గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణికులను నాటు పడవలపై తరలించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, ఫిట్‌నెస్ లేని పడవలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘోర ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## రాజ్ ఠాక్రే పుట్టినరోజు కానుక..
## ముంబైలో టూవీలర్లకు పెట్రోల్‌పై రూ.5 తగ్గింపు



**ముంబై:** పెరుగుతున్న ఇంధన ధరలతో సతమతమవుతున్న సామాన్య వాహనదారులకు ఉపశమనం కల్పించే దిశగా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్టీ అధినేత రాజ్ ఠాక్రే పుట్టినరోజు సందర్భంగా ముంబైలోని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్‌పై ప్రత్యేక తగ్గింపును ప్రకటించింది. ఈ పథకం కింద నగరంలోని ఎంపిక చేసిన 36 పెట్రోల్ బంకుల్లో టూవీలర్లకు లీటర్ పెట్రోల్‌పై రూ.5 తగ్గింపును అందిస్తోంది. రాజ్ థాకరే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఒక్కరోజు పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.దేశంలో ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో ఎంఎన్ఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమం ద్వారా సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు.ఈ చొరవపై ఎంఎన్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ జై శృంగార్‌పురే మాట్లాడుతూ.. "ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి సమయంలో మా వంతుగా ప్రజలకు కొంత మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని వివరించారు.మరో ఎంఎన్ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పెట్రోల్ ధరల భారాన్ని అంతిమంగా ప్రజలే మోస్తున్నారని, వినియోగదారులపై ఒత్తిడి తగ్గించడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయని, ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న పౌరులకు ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.గతంలో కూడా ఇంధన ధరల పెంపు, ద్రవ్యోల్బణంపై ఎంఎన్ఎస్ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ తాజా కార్యక్రమం ద్వారా ముంబై వాసులకు తక్షణ ఊరట లభిస్తుందని, రోజువారీ ఖర్చుల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందని పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి : సిఐ లక్ష్మన్న



కలకడ (సింధూర దర్శిని) 14 జూన్ అన్నమయ్య జిల్లా : అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కలకడ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి లక్ష్మన్న ఒక ప్రకటనలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన కలకడ సర్కిల్ కార్యాలయంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ .... మండలంలోని గ్రామాలలో అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించిన ఎడల స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. అదే విధంగా మీకు సంబంధించిన వస్తువులు కాకుండా వేరే వారి వస్తువులు కనిపించిన ఎడల వాటిని తాకకుండా, తీసుకెళ్లకుండా గుర్తించిన వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించినట్లు తెలిపారు. తమకు పరిచయం లేని వ్యక్తులు గ్రామంలో పర్యటించినచో వారి కదలికలను గమనించి వారి ప్రవర్తన మార్పు ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. యజమానులేని బ్యాగులు బాక్సులు వస్తువులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటివాటిని స్వయంగా పరిశీలించే ప్రయత్నాలకుల చేయరాదని తెలియజేసినట్లు తెలిపారు. ఒకవేళ అలాంటి వస్తువులు కనిపించిన ఎడల 100 లేక 112 కు సమాచారం అందించాలన్నారు.

## తిరుమలలో జనసేన కార్యకర్తల అత్యుత్సాహం.. టీటీడీ రూల్స్ బ్రేక్

- తిరుమలలో జనసేన కార్యకర్తల నిబంధనల ఉల్లంఘన
- 'పవన్ కల్యాణ్ అనే నేను' పుస్తకంతో రీల్స్, వీడియోల చిత్రీకరణ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్.. భక్తుల నుంచి తీవ్ర ఆగ్రహం
- టీటీడీ కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్ల డిమాండ్
- కొండపై రాజకీయ ప్రచారాలపై నిషేధం ఉందని గుర్తుచేస్తున్న భక్తులు




తిరుమల (సింధూర దర్శిని) 14 జూన్ : కలియుగ వైకుంఠం, కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం కొలువైన తిరుమల క్షేత్రంలో కొందరు జనసేన కార్యక ర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు ప్రదర్శించిన అత్యుత్సాహం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి ఆలయ సమీపంలో నిబంధనలను బేఖాతరు చేస్తూ రాజకీయ ప్రచారానికి పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. కొందరు జనసేన కార్యకర్తలు తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలో 'పవన్ కల్యాణ్ అనే నేను' అనే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ వీడియో రీల్స్ చిత్రీకరించారు. ఈ పుస్తకాన్ని ప్రమోట్ చేసే ఉద్దేశంతో వారు ఈ చర్యకు పాల్పడ్డారు. ఆలయ పరిసరాల్లో మొబైల్ ఫోన్ల వాడటం, వీడియోలు తీయడం పూర్తిగా నిషేధం అని తెలిసినప్పటికీ, వారు ఈ నిబంధనలను ఉల్లంఘించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో శ్రీవారి భక్తులు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ..

తిరుమల కొండపై ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావులేదని టీటీడీ స్పష్టమైన నిబంధనలను అమలు చేస్తోంది. కొండపై రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, నినాదాలు, ప్రసంగాలు పూర్తిగా నిషేధం. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడేటప్పుడు కూడా రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని ప్రముఖులకు సైతం టీటీడీ సూచిస్తుంటుంది. ఆలయ పవిత్రతను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడటమే ఈ నిబంధనల ముఖ్య ఉద్దేశం. అంతేగాక ఆలయ మాడ వీధులు, పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల వాడకం, ఫొటోలు, వీడియోల చిత్రీకరణపై కఠినమైన నిషేధం అమలులో ఉంది. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది నిరంతరం నిఘా పెట్టినా, కొందరు యాత్రికులు నిబంధనలను అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు టీటీడీ కఠినంగా వ్యవహరించింది.

### టీటీడీ స్పందనపై సర్వత్రా ఆసక్తి

తాజాగా జరిగిన ఈ ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. రాజకీయ అభిమానాన్ని ప్రదర్శించాల్సింది పవిత్ర పుణ్యక్షేత్రంలో కాదని, ఇలాంటి చర్యల వల్ల క్షేత్ర పవిత్రత మసకబారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించిన ఈ వ్యక్తులపై టీటీడీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ ఘటనపై టీటీడీ అధికారికంగా స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.



## నేడు బంగారంధరలు ఇలా..

- హైదరాబాద్‌లో స్థిరంగా ఉన్న బంగారం, వెండి ధరలు
- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,080
- 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,36,650

కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద నిలకడతెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఆదివారం (జూన్ 14, 2026) స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నిన్నటి ధరలే నేడూ కొనసాగుతున్నాయి. ఇటీవల స్వల్ప హెచ్చుతగ్గులకు లోనైన పసిడి, వెండి ధరలు ప్రస్తుతం నిలకడగా ఉండటంతో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించినట్లయింది.గుడ్‌రిటర్న్స్ నివేదికల ప్రకారం, హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,49,080 వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,36,650గా కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం తులం ధర రూ.1,11,810 వద్ద నిలకడగా ఉంది.పసిడి బాటలోనే వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద ఉండగా, 100 గ్రాముల వెండి ధర రూ.27,000గా నమోదైంది. అయితే, వివిధ నగల దుకాణాలను బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉన్నందున, కొనుగోలుదారులు ముందుగా స్థానిక మార్కెట్ ధరలను నిర్ధారించుకోవడం ఉత్తమం.

## తాతతో బైక్‌పై వెళ్తుండగా ఐదేళ్ల బాలిక కిడ్నాప్.. అత్యాచారం

- ఉత్తరప్రదేశ్‌లోని బలియాలో ఘటన
- ఫిర్యాదు అందిన గంటల వ్యవధిలోనే బాలికను రక్షించిన పోలీసులు
- నిందితుడు చందన్ కుమార్ షా అరెస్ట్
- పోక్సో, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు

**ఉత్తరప్రదేశ్:** ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలో ఐదేళ్ల పసికందుపై జరిగిన ఘోర అఘాయిత్యం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తాతతో కలిసి బైక్‌పై వెళ్తున్న బాలికను అపహరించి, అత్యాచారానికి ఒడిగట్టిన ఒక కామాంధుడిని బలియా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే స్పందించిన పోలీసులు, బాలికను రక్షించి నిందితుడిని కటకటాల్లోకి నెట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 11 రాత్రి బాన్సడీ రోడ్డు కూడలి దాటిన తర్వాత ఓ కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్ సమీపంలో ఈ ఘోరం జరిగింది. బాలిక తాత అత్యవసర పని నిమిత్తం తన మోటార్ సైకిల్‌ను రోడ్డు పక్కన ఆపాడు. అదే సమయంలో వేరే బైక్‌పై అక్కడికి వచ్చిన నిందితుడు చందన్ కుమార్ షా (29) బైక్‌పై కూర్చుని ఉన్న ఐదేళ్ల చిన్నారిని బలవంతంగా ఎత్తుకెళ్లి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ షాకింగ్ ఘటనపై బాలిక తండ్రి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగారు.ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు అదే రోజున చిన్నారిని నిందితుడి బారి నుంచి రక్షించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో బాలికపై లైంగిక దాడి జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనితో నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 65(2) (అత్యాచారం), పోక్సో (POCSO) చట్టంలోని కఠిన నిబంధనల కింద కేసులు నమోదు చేశారు. శనివారం ధేలహ్వా బాబా నుంచి దుభద్ వైపు వెళ్లే రహదారి సమీపంలో నిందితుడు చందన్ కుమార్ షాను అరెస్ట్ చేసి, నేరానికి వాడిన బైక్‌ను సీజ్ చేశారు.

## కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన ప్రదర్శన



హైదరాబాద్ (సింధూర దర్శిని) 14 జూన్ : నీట్ పరీక్షల్లో అక్రమాలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఆదివారం భారీ నిరసన చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పేపర్ లీకేజీ వివాదం, సీబీఎస్ఈ (CBSE) ఆన్-స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్‌లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో.... పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఇందులో భాగంగా నేడు హైదరాబాద్ వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ (CJP) భారీ నిరసనను చేపట్టింది. ఇందులో పలు విద్యార్థి, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఎన్టీఏకు వ్యతిరేకంగా నిరసన స్వరాన్ని వినిపించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువత, విద్యావేత్తలు భారీ సంఖ్యలో ధర్నా చౌక్‌కు తరలివచ్చారు. "మాకు న్యాయం కావాలి" (We Want Justice), "ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి" అంటూ నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు చేతబూని కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త, మెగసేసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ తన మద్దతును ప్రకటించారు. హైదరాబాద్ ధర్నా చౌక్‌లో జరుగుతున్న ఈ సభను ఉద్దేశించి తాను ప్రసంగించబోతున్నట్లు ఆయన స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ధర్నాలో రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.



## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**- బిసివై పార్టీ రాష్ట్ర యూత్ కో కన్వీనర్ పూల ప్రేమ్ కుమార్**

చిత్తూరు (సింధూర దర్శిని) 14 జూన్ : భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో పుంగనూరులో నిర్వహించనున్న జాబ్ మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కో కన్వీనర్ పూల ప్రేమ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వీకోటలో ఆదివారం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బిసివై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 18న పుంగనూరు ఆర్ సి వై ఎస్టేట్ లో పెద్ద ఎత్తున జాబ్ మేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుండి రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలకు అనేక విధాల తోడ్పాటు అందిస్తూ తనదైన శైలిలో పార్టీ తరపున వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో నిలిచిన నేత బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. అదే స్ఫూర్తితో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి నుండి ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు తమ పేర్లను బిసివైపార్టీ. ఆర్గ/ బిసివైజాబ్స్ (bcyparty.org/bcyjobs) లింకు నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దాదాపు 200 కంపెనీలకు పైగా ఈ జాబ్ మేళాలో యువతకు ఉపాధి కల్పించేందుకు హాజరు అవుతున్నట్లు వారు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వీరి వెంట బి సి వై పార్టీ చిత్తూరు జిల్లా యూత్ కన్వీనర్ అరుణ్ కుమార్ వడియార్ తో పాటు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## ఐఐఐటి సాధించిన సోంపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని



విజయనగరం (సింధూర దర్శిని) 14 జూన్ : వేపాడా మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరొకసారి విద్యా ప్రమాణాలను చాటిచెప్పిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ బి.పి. ఏ .రాజు తెలియజేశారు. 2026 మార్చ్ పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి 600 కు గాను 574 మార్కులతో మండల త్రితీయ స్థానం సాధించి పలువురి ప్రశంసలు అందుకున్న కోరుబిల్లి స్వరూప ఈ విజయానికి మరో మైలురాయిగా ఇటీవల ప్రకటించిన RGUKT IIIT జెనరల్ కేటగిరీ లో శ్రీకాకుళం క్యాంపస్ లోకి ఎంపిక చేయబడింది. తండ్రి ఆటో డ్రైవర్, తల్లి కూలి పనులతో కార్పొరేట్ ఉన్నత చదువులు పొందే అవకాశం లేకపోగా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తన పట్టుదలలే పునాదిగా సాధించిన ఈ విజయం గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల ప్రతిభకు నిదర్శనమని "పట్టుదల, లక్ష్యం ఉంటే ఉచిత విద్యే ప్రోత్సాహకంగా ప్రభుత్వ పాఠశాలలే ఉన్నత శిఖరాలకు నిచ్చెనలని " చెప్పడానికి స్వరూపే నిదర్శనమని చెబుతూ ఇంచార్జ్ శ్రీ వి జగన్నాధరావు, శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది మరియు గ్రామ పెద్దలు ఈ విద్యార్థిని అభినందించారు. ఈ స్ఫూర్తి తో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ సదుపాయాలతో పాటు ఈ పాఠశాల ప్రత్యేక అవకాశాలైన స్కౌట్స్‌డ గైడ్స్, నగదు ప్రోత్సాహకాలు తదితర సదుపాయాలను తమ పిల్లలకు అందించాలని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

## గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం : ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




విజయనగరం (సింధూర దర్శిని) 14 జూన్ : జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు రవాణా, సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపనున్నట్లు జిల్లా ఎస్పీఎ. ఆర్. దామోదర్ వెల్లడించారు. ఆదివారం సాధారణ సందర్శనలో భాగంగా బుధరాయవలస పోలీస్ స్టేషన్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళల భద్రతతో పాటు సైబర్ నేరాలు అదుపుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళల భద్రత పట్ల అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే కాకుండా, వాహన చోధకులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్లో దస్త్రాలను పరిశీలించి, సిబ్బంది పనితీరును కొనియాడారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న భవనాలను పరిశీలించి భవనాల్లో పోలీస్ సిబ్బందికి తగు సదుపాయాలు కల్పించాల్సిందిగా ఎస్ఐకి సూచించారు. భవనాలు కూడా పెయింట్స్ వేయాల్సిందిగా, అదేవిధంగా స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటాల్సిందిగా సూచించారు. ఈ సందర్శనలో ఆయన తో పాటు డి.ఎస్.పి. ఎస్ రాఘవులు, సిఐ జి శంకర్రావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జె. లోకేష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

జగ్గంపేట (సింధూర దర్శిని) 14 జూన్ కాకినాడ జిల్లా: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 22 మందికి టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పేదవారికి వైద్యం కోసం ప్రభుత్వం అందించిన రూ.6,90,766 చెక్కులను ఆదివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అయన అందజేశారు.

# బ్రెయిన్ ఫాగ్... అందరినీ వేధిస్తున్న కొత్త సమస్య!

- అన్ని వయసుల వారిలో పెరుగుతున్న బ్రెయిన్ ఫాగ్ సమస్యలు
- మానసిక అలసట, మతిమరుపు, ఏకాగ్రత లోపించడం ప్రధాన లక్షణాలు
- తీవ్ర ఒత్తిడి, నిద్రలేమి, డిజిటల్ వినియోగమే కారణాలంటున్న నిపుణులు
- జీవనశైలిలో మార్పులతో దీనిని అధిగమించవచ్చని సూచన
- కరోనా వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా ఈ లక్షణాలు కనిపిస్తున్న వైనం



ఒకప్పుడు పెద్ద వయసు వారిలో కనిపించే మతిమరుపు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు ఇప్పుడు అన్ని వయసుల వారినీ వేధిస్తున్నాయి. చిన్న విషయాలను మర్చిపోవడం, దేనిపైనా దృష్టి పెట్టలేకపోవడం, మానసికంగా అలసిపోయినట్లు అనిపించడం వంటి లక్షణాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. వైద్య పరిభాషలో దీన్ని నిర్దిష్టమైన వ్యాధిగా చెప్పనప్పటికీ, ఈ లక్షణాలన్నింటినీ కలిపి 'బ్రెయిన్ ఫాగ్' (దీఙుఱఅ ఖీశీస్త్ర) అని పిలుస్తున్నారు. ఆధునిక జీవనశైలి ఒత్తిళ్ల కారణంగా ఈ సమస్య ఇప్పుడు యువత, ఉద్యోగులు, విద్యార్థులలో కూడా సర్వసాధారణంగా మారుతోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రెయిన్ ఫాగ్ అనేది రోజువారీ జీవితంలో స్పష్టంగా కనిపిస్తుంది. గదిలోకి ఎందుకు వెళ్లామో ఒక్కసారిగా మర్చిపోవడం, పుస్తకంలోని ఒకే పేరాను పదే పదే చదివినా అర్థం కాకపోవడం, సాధారణ పనుల సమయంలో కూడా దృష్టిని కేంద్రీకరించలేకపోవడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. ఇలాంటి అనుభవాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని, ఇది పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతోందని చాలామంది వాపోతున్నారు.

### ప్రధాన కారణాలు ఇవే..

ఈ పరిస్థితికి దీర్ఘకాలిక ఒత్తిడే ప్రధాన కారణమని ఫరీదాబాద్‌లోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హాస్పిటల్ న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ వినీత్ బంగా వివరించారు. పని ఒత్తిళ్లు, ఆర్థిక సమస్యలు, చదువుల భారం, డిజిటల్ ప్రపంచం నుంచి నిరంతరం వెల్లువెత్తే సమాచారం మెదడు స్పష్టంగా ఆలోచించే సామర్థ్యాన్ని దెబ్బతీస్తోందని ఆయన తెలిపారు. దీర్ఘకాలిక ఒత్తిడి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశోధనలు కూడా రుజువు చేస్తున్నాయి.

ఒత్తిడితో పాటు, నిద్రలేమి కూడా బ్రెయిన్ ఫాగ్‌కు మరో ముఖ్యమైన కారణం. తగినంత నిద్ర లేనప్పుడు మెదడు విశ్రాంతి తీసుకోలేదు. జ్ఞాపకాలను పదిలపరచుకోవడం, మెదడులోని వ్యర్థాలను శుభ్రపరచడం వంటి కీలక ప్రక్రియలకు ఆటంకం కలుగుతుంది. తక్కువ గంటలు నిద్రపోయి అలవాటు చేసుకున్న వారిలో కూడా క్రమంగా ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లుతాయని డాక్టర్ బంగా హెచ్చరించారు.

వీటితో పాటు గంటల తరబడి స్క్రీన్లకు అతుక్కుపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, డీహైడ్రేషన్ వంటివి సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. కోవిడ్-19 వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత మిగిలిన దీర్ఘకాలిక ప్రభావాలు, ఆందోళన, డిప్రెషన్, హార్మోన్ల అసమతుల్యత కూడా బ్రెయిన్ ఫాగ్ లక్షణాలకు దారితీస్తాయి. ఇటీవలి కాలంలో ఈ తరహా అభిజ్ఞా సమస్యలు ముఖ్యంగా యువతలో పెరిగినట్లు పలు అధ్యయనాలు, నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'తో పాటు ఇతర ఆరోగ్య ప్రచురణలు కూడా ఈ అంశంపై ప్రత్యేక కథనాలను ప్రచురించాయి.

### నివారణ, పరిష్కార మార్గాలు

ఈ సమస్యను అధిగమించడానికి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రోజూ కనీసం 7-8 గంటల పాటు నిరంతరాయంగా నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా లేదా ధ్యానం వంటివి పాటించడం ముఖ్యం. స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవడం కూడా తప్పనిసరి. ఒకవేళ ఈ లక్షణాలు తీవ్రంగా ఉంటే, వాటిని తేలికగా తీసుకోకుండా వైద్యులను సంప్రదించి ఇతర ఆరోగ్య సమస్యలేవైనా ఉన్నాయేమో నిర్ధారించుకోవడం మంచిది..

# కృష్ణమ్మకు జలకళ - ప్రకాశం బ్యారేజి గేట్లు ఎత్తివేత



విజయవాడ (సింధూర దర్శిని) 14 జూన్: నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో ఎపి, కర్నాటక, తమిళనాడు, కేరళల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఎపి లో నేడు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడటానికి అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. నేడు కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. దక్షిణ కోస్తా తీర ప్రాంతం, రాయలసీమ జిల్లాలపై రుతుపవనాల ప్రభావం కొనసాగుతోంది. పలు చోట్ల ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం పడుతోంది.ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణా నది జలకళను సంతరించుకుంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఈ ఉదయం గేట్లను ఎత్తివేశారు అధికారులు. సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నది దిగువ భాగానికి నీరు వదలడం ఇదే మొదటిసారి. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో స్థానిక పరివాహక ప్రాంతాల నుంచి బ్యారేజీకి వచ్చే నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అదనపు నీటిని పరిమితంగా విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు.కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య నాలుగు గేట్లు ఎత్తారు. ఆ సమయంలో దిగువకు సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల మధ్య నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా విడుదలైన నీటి పరిమాణం సుమారు 2,900 క్యూసెక్కులుగా నమోదైంది. స్థానిక క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మిగులు నీటిని వదిలినట్లు వివరించారు.ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులకు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి విడుదల తక్కువ పరిమాణంలోనే ఉన్నప్పటికీ, ప్రవాహం పెరిగే పరిస్థితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల దృశ్యాలను చూసేందుకు వచ్చిన సందర్శకులు బ్యారేజీ పరిసరాల్లో నిలిచారు.కాగా.. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నేడు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు.

# రాష్ట్రంలోనే నార్పల రక్తదాన శిబిరానికి ప్రథమస్థానం

అనంతపురం (సింధూర దర్శిని) 14 జూన్ : సమాజ సేవలో శింగనమల నియోజకవర్గం, నార్పల పేరు రాష్ట్ర చరిత్ర పుటల్లోకెక్కింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా .... నార్పలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం ఆల్-టైమ్ రికార్డు సృష్టించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చరిత్రలోనే ఒక్కరోజులో అత్యధిక సంఖ్యలో రక్తదాతలు ముందుకు వచ్చి రక్తం ఇచ్చిన ఏకైక కేంద్రంగా నిలిచి, రాష్ట్రంలోనే మన శింగనమల నియోజకవర్గం, నార్పల మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రివర్యులు డాక్టర్ సాకే శైలజానాథ్ సమక్షంలో, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు ధర్మవరం నియోజకవర్గ పరిశీలకులు నార్పల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రక్తదాన కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. జగనన్న పై ఉన్న అభిమానంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి భారీ ఎత్తున రక్తదానం చేయడంతో ఈ అపూర్వ రికార్డు సాధ్యమైంది.రెడ్ క్రాస్ సొసైటీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిన ఈ సేవా




కార్యక్రమానికి గానూ నార్పలకు అధికారికంగా రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఈ నెల 14వ తేదీన (ఆదివారం) ఏలూరులో నిర్వహించబోయే "ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డుల దినోత్సవం" వేడుకల్లో భాగంగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును సత్యనారాయణ రెడ్డి అందుకున్నారు. శింగనమల నియోజకవర్గం కి ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల డాక్టర్ సాకే శైలజానాథ్, నార్పల సత్యనారాయణ రెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. ప్రాణదాతలుగా నిలిచి శింగనమల నియోజకవర్గం, నార్పల కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిచెప్పిన ప్రతి ఒక్క రక్తదాతకు, యువతకు, వైఎస్సార్‌సీపీ సైనికులకు మరియు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెడ్ క్రాస్ సొసైటీ వైద్య సిబ్బందికి మండల కన్వీనర్ ఖాదర్ వలీ ఖాన్ హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ అవార్డు రావడం శింగనమల నియోజకవర్గానికే గర్వకారణమని అన్నారు.

# ఆరెంజ్ కన్నా 12 రెట్లు ఎక్కువ విటమిన్ సి... హిమాలయ ఫలంతో ఎంబీఏ యువకుడి సక్సెస్ ఫుల్ బిజినెస్!


- లడక్‌కు చెందిన 'సీ బక్‌థార్న్' బెర్రీతో 'జింపో' బ్రాండ్ ఏర్పాటు
- థిన్లే సింఫే అనే ఎంబీఏ యువకుడి వినూత్న వ్యాపార ప్రస్థానం
- ఈ 'మిరాకిల్ బెర్రీ'లో పోషక విలువలు చాలా అధికం
- స్థానిక రైతులకు ఉపాధి కల్పిస్తూ ఏటా రూ.10 లక్షల ఆర్జన



లడఖ్‌కు చెందిన ఒక ఎంబీఏ గ్రాడ్యుయేట్, హిమాలయాల్లో అడవి పండుగా పెరిగే 'సీ బక్‌థార్న్' బెర్రీతో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. పోషక విలువలు మెండుగా ఉన్న ఈ ఫలానికి తన 'జింపో' బ్రాండ్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టాడు. స్థానికంగా లభించే ఈ సూపర్‌ఫుడ్‌ను ఒక విజయవంతమైన వ్యాపారంగా మలిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. లడఖ్‌కు చెందిన థిన్లే సింఫేకు 2016లో ఎంబీఏ విరామ సమయంలో ఒక కేరళ వైద్యుడితో సాగించిన సంభాషణే ఈ వ్యాపార ఆలోచనకు బీజం వేసింది. హిమాలయ మూలికలపై జరిగిన ఆ చర్చ, 'సీ బక్‌థార్న్'లోని పోషక విలువలపై అతడి దృష్టి మళ్లేలా చేసింది. ఈ పండును 'మిరాకిల్ బెర్రీ'గా పిలుస్తారు. ఇందులో ఒమేగా 3, 6, 9తో పాటు అరుదైన ఒమేగా 7 కూడా ఉంటుంది. నారింజ పండ్లతో పోలిస్తే 12 రెట్లు అధికంగా విటమిన్-సి ఉండటమే కాకుండా, విటమిన్-ఎ, ఇ, యాంటీఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. లడఖ్ సీ బక్‌థార్న్‌కు ఇప్పటికే భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కూడా లభించింది.

సుమారు మూడేళ్ల సుదీర్ఘ ప్రణాళిక అనంతరం, లదఖీ భాషలో 'రుచికరమైన' అని అర్థం వచ్చేలా 'జింపో' పేరుతో సింఫే తన బ్రాండ్‌ను ప్రారంభించాడు. స్థానిక గ్రామస్థుల నుంచి నేరుగా బెర్రీలను సేకరిస్తూ, వాటితో రెడీ-టు-డ్రింక్ జ్యూస్‌లు, పల్ప్, జామ్‌లు వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నాడు. ఈ వ్యాపారం ద్వారా అతడు ఏటా సుమారు రూ. 10 లక్షలు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. దీనితో పాటు, 'జీరో వేస్ట్ లడక్' సంస్థతో కలిసి 'బాటిల్ బై-బ్యాక్' కార్యక్రమాన్ని చేపడుతూ పర్యావరణ పరిరక్షణకు సైతం తనవంతు కృషి చేస్తున్నాడు.

# ఇప్పుడు మారిపోతున్న బాత్రూమ్ డిజైన్లు



- బాత్రూమ్ రినోవేషన్లలో ట్రెండ్స్ కన్నా నాణ్యతకే ప్రాధాన్యం
- సహజమైన మెటీరియల్స్, లైటింగ్‌తో డిజైన్లకు శాశ్వత ఆకర్షణ
- ఇంటి నిర్మాణంలో బాత్రూమ్‌లను చిన్నచూపు చూడొద్దంటున్న డిజైనర్లు
- భారతీయ డిజైనర్లు రూపొందించిన కొన్ని ప్రత్యేక బాత్రూమ్‌ల వివరాలు

ఇంట్లో బాత్రూమ్‌ను కొత్తగా మార్చాలనుకుంటున్నారా? అయితే ప్రస్తుతం వస్తున్న కొత్త కొత్త ట్రెండ్స్ వెనుక పరుగెత్తకుండా, శాశ్వతంగా నిలిచిపోయే డిజైన్ల వైపు మొగ్గు చూపడం మేలని ఆర్కిటెక్చరల్ నిపుణులు సూచిస్తున్నారు. కేవలం ఫంక్షనల్ ఏరియాలా కాకుండా, ఇంటికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చేలా బాత్రూమ్‌లను తీర్చిదిద్దాలని చెబుతున్నారు. ఆర్కిటెక్చరల్ డైజెస్ట్ ఇండియా ఇటీవల ప్రచురించిన కథనం ప్రకారం, కొన్ని డిజైన్ సూత్రాలు పాటిస్తే బాత్రూమ్‌లు ఎప్పటికీ కొత్తగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. సాధారణంగా ఇంటి నిర్మాణంలో బాత్రూమ్‌లను ఆఖరి ప్రాధాన్యతగా చూస్తారని, కానీ ఈ ధోరణి ఇప్పుడు మారుతోందని నిపుణులు చెబుతున్నారు. బాత్రూమ్‌ను కేవలం ఒక ఫంక్షనల్ ప్రదేశంగా కాకుండా, మానసిక ప్రశాంతతను ఇచ్చే ఒక ప్రత్యేక అనుభవంగా మార్చడంపై డిజైనర్లు దృష్టి పెడుతున్నారు. సహజ కాంతి ప్రసరించేలా చూడటం, నాణ్యమైన రాళ్లు, కలప వంటి మెటీరి యల్స్ వాడటం, ప్రకృతికి దగ్గరగా ఉండేలా డిజైన్ చేయడం వంటివి ఇందులో ముఖ్యమైన అంశాలు.

### నిపుణులు సూచిస్తున్న కొన్ని డిజైన్ సూత్రాలు ఇవే:

**ప్రకృతితో అనుసంధానం:** బాత్రూమ్‌ను బయటి ప్రపంచానికి పొడిగింపుగా భావించాలి. గాజు గోడలతో కూడిన బాత్‌టబ్ చుట్టూ పచ్చని మొక్కలను ఏర్పాటు చేయడం ద్వారా అద్భుతమైన అనుభూతిని పొందవచ్చు. సువర్ణ జైన్ స్టూడియో రూపొందించిన "రెయిన్‌ఫారెస్ట్ రిట్రీట్" ఇందుకు చక్కటి ఉదాహరణ.

**లైటింగ్‌కు ప్రాధాన్యం:** సహజమైన వెలుతురు పడేలా డిజైన్ చేయడం ముఖ్యం. స్కైలైట్లు, కిటికీల ద్వారా వచ్చే కాంతి.. మార్బుల్, టెర్రాజో వంటి మెటీరియల్స్‌పై పడి బాత్రూమ్‌కు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుంది.

**సహజమైన మెటీరియల్స్:** నదిలో దొరికే రాళ్లను వాష్‌బేసిన్‌లుగా మార్చడం వంటివి ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. 300 కిలోల బరువున్న నది రాతిని వాష్‌బేసిన్‌గా మార్చి వాడిన 'డి'జైనా ఇంటీరియర్స్' ప్రాజెక్ట్ దీనికి నిదర్శనం. సహజమైన రాళ్లు, టెక్స్‌చర్లతో కూడిన డిజైన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**స్థలానికి తగిన పరిష్కారాలు:** స్థలం చిన్నదిగా ఉన్నప్పుడు, అక్కడికక్కడే అవసరానికి తగినట్టుగా టైల్స్, రాళ్లతో బాత్‌టబ్ నిర్మించడం వంటివి చేయవచ్చు. గురుగ్రామ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 'బోనిటా కాసా' సంస్థ ఇలాంటి డిజైన్‌ను విజయ వంతంగా అమలు చేసింది. కాబట్టి, బాత్రూమ్ రినోవేషన్ చేసేటప్పుడు పూర్తిగా పడగొట్టే బదులు, ఇప్పటికే ఉన్న నాణ్యమైన రాతిపని లేదా మంచి లేఅవుట్ వంటి వాటిని కాపాడుకుంటూ, కేవలం ఫిక్చర్‌లను ఆధునికంగా మార్చుకుంటే సరిపోతుం దని నిపుణులు సలహా ఇస్తున్నారు.

# తీసి పక్కన పెట్టే కరివేపాకుతో ఇన్ని లాభాలా..?

- రుచి, సువాసనకే కాదు ఆరోగ్యానికి మేలు చేసే కరివేపాకు
- విటమిన్ ఏ, సీ, ఫైబర్ వంటి పోషకాల సమాహారం
- ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు
- గుండె ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపునకు దోహదం
- జీర్ణక్రియను మెరుగుపరచి, రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది



భారతీయ వంటగదిలో కరివేపాకు లేని తాలింపును ఊహించడం కష్టం. కూరకు చక్కటి సువాసన, రుచిని అందించే కరివేపాకును చాలామంది భోజనం చేసేటప్పుడు ఏరి పక్కన పెట్టేస్తుంటారు. అయితే, అలా తీసిపారేసే ఆకుల్లోనే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం ఓ సుగంధ ద్రవ్యం మాత్రమే కాదు, మన పెరట్లోని ఓ శక్తివంతమైన ఔషధ గని అని వారు వివరిస్తున్నారు. కరివేపాకును 'యాంటీఆక్సిడెంట్ల పవర్ హౌస్' అని పిలవడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సీ, ఫ్లేవనాయిడ్లు, కార్బజోల్ ఆల్కలాయిడ్లు వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే కణాల నష్టాన్ని నివారిస్తాయి. ఈ ఫ్రీ రాడికల్స్ కారణంగానే వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం, దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముట్టడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కరివేపాకును రోజూ తీసుకోవడం వల్ల ఈ ఆక్సిడేటివ్ స్ట్రెస్ ప్రభావం తగ్గి, శరీరం అంతర్గతంగా బలోపేతం అవుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కరివేపాకు దివ్యౌషధంలా పనిచేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను సులభతరం చేసి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. అంతేకాకుండా, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు తమ ఆహారంలో కరివేపాకును భాగం చేసుకోవడం వల్ల షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కరివేపాకులో సమృద్ధిగా ఉండే విటమిన్ సీ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది శరీరాన్ని ఇన్ఫెక్షన్ల బారి నుంచి కాపాడుతుంది. అదేవిధంగా, విటమిన్ ఏ కంటి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. రేచీకటి వంటి సమస్యలను నివారించి, కంటిచూపును మెరుగుపరచడంలో ఇది తోడ్పడుతుంది. ఈ పోషకాలన్నీ గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి దోహదపడతాయి. కాబట్టి, ఇకపై కరివేపాకును పక్కన పెట్టకుండా, దాని ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందేందుకు ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం.



## ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎంమ్మెల్యే

జగ్గంపేట (సింధూర దర్శిని) 14 జూన్ కాకినాడ జిల్లా: ఫిట్ ఇండియా కార్యక్రమంలో పోలీసులు చేపట్టిన ర్యాలీని స్థానిక ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రు ప్రారంభించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ నుండి సిఐ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్సై లు రఘునాథరావు,యు.వి శివ నాగబాబు, సతీష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



## చరిత్ర సృష్టించిన యువ కెప్టెన్ గిల్ భారత రికార్డులన్నీ బద్దలు ..!

హిమాచల్ ప్రదేశ్ (ధర్మశాల) : ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టుకు విజయాన్ని అందించిన యువ కెప్టెన్ శుభ్ మన్ గిల్ మరో విశిష్ట ఘనతను తన పేరుమీద నమోదు చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా గిల్ కొత్త రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో అజేయంగా 84 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లో 3000 వన్డే పరుగుల మైలురాయిని కేవలం 62 ఇన్నింగ్స్‌ల్లోనే చేరుకున్నాడు. దీంతో గతంలో 72 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించిన శిఖర్ ధావన్ రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో 75 ఇన్నింగ్స్‌ల్లో 3000 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఉన్నాడు. ప్రపంచ స్థాయిలో చూస్తే, 57 ఇన్నింగ్స్‌ల్లోనే 3000 పరుగులు సాధించిన హాషీమ్ ఆమ్లా మాత్రమే గిల్ కంటే ముందున్నాడు. వర్షం కారణంగా నాలుగు గంటలకు పైగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు, ఓపెనర్ గుర్బాజ్ (51 బంతుల్లో 102 పరుగులు) శతకంతో 194 పరుగులు సాధించింది. 195 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు గిల్ అద్భుత ఆరంభాన్ని అందించాడు. అతను 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 84 పరుగులు చేసి చివరి వరకు నిలిచాడు. మరోవైపు కెఎల్ రాహుల్ 19 బంతుల్లో 39 పరుగులతో కీలక సహకారం అందించాడు. ఫలితంగా భారత్ 2.3 ఓవర్లు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయాన్ని ఖాయం చేసింది. ఈ గెలుపుతో మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డే లక్నోలో, చివరి మ్యాచ్ చెన్నైలో జరగనుంది.

## ఫిఫా ప్రపంచకప్‌లో ఖతార్ vs స్విట్జర్లాండ్ మ్యాచ్ డ్రా



ఫిఫా ప్రపంచకప్‌లో ఖతార్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. గ్రూప్-బిలో భాగంగా స్విట్జర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరును 1-1తో డ్రా చేసుకోవడం ద్వారా, ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఖతార్ తొలిసారిగా తన ఖాతాలో ఒక పాయింట్‌ను వేసుకుంది. మ్యాచ్ ప్రారంభమైన 17వ నిమిషంలోనే స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలో పెనాల్టీ ద్వారా గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత స్విస్ జట్టు మైదానంలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, ఖతార్ రక్షణ శ్రేణిని ఛేదించి మరో గోల్ సాధించలేకపోయింది. ఇక మ్యాచ్ స్విట్జర్లాండ్ వశమౌతుందనుకుంటున్న తరుణంలో.. చివరి నిమిషంలో ఖతార్ అనూహ్యంగా పుంజుకుంది. ఇంజూరీ టైమ్‌లో (90+4e నిమిషంలో) ఖతార్ ఆటగాడు బౌలెమ్ ఖౌఖీ అద్భుతమైన హెడర్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి స్కోరును సమం చేశాడు. దీంతో ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓటమి అంచుల్లోంచి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన ఖతార్, మెగా టోర్నీలో తన మొదటి పాయింట్‌ను నమోదు చేసి సరికొత్త మైలురాయిని అందుకుంది.

# సినిమా న్యూస్



## భారీ అంచనాలతో జులై 3న 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'

**విరాట్ కర్ణ హీరోగా 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం**

**జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల**

**అభిషేక్ నామా దర్శకత్వంలో మైథలాజికల్ ఫాంటసీ థ్రిల్లర్**

**నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటన**

**భారీ తారాగణంతో సినిమాపై పెరుగుతున్న ఆసక్తి**

యువ నటుడు విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. గతంలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, కాన్సెప్ట్ పరంగా సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రహస్య నిధి అన్వేషణ, పురాణ గాథల నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా 'స్వామి వారి రథయాత్ర' పేరుతో చేపట్టిన ప్రచార కార్యక్రమం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నగార్కర్, రిషభ్ సాహ్ని వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణం, ఉన్నత సాంకేతిక విలువలతో వస్తున్న 'నాగబంధం' చిత్రం జులై 3న థియేటర్లలో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్-రష్మిక.. విద్యార్థులకు అండగా కొత్త దంపతులు



**విజయ్ దేవరకొండ, రష్మిక దంపతుల గొప్ప మనసు**

**ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులకు అండగా నిలిచిన విజయ్ దేవరకొండ, రష్మిక**


**విజయ్ తండ్రి స్వగ్రామమైన సొంత గ్రామమైన తుమ్మన్‌పేటలో విద్యా సహాయం**

**దేవరకొండ ఫౌండేషన్ ద్వారా 44 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత**

స్టార్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందణ్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాము ప్రకటించినట్టుగానే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయ్ తండ్రి జన్మించిన తెలంగాణలోని అచ్చంపేట మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ మేరకు విజయ్ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "మా నాన్న పుట్టిన చిన్న పల్లె తుమ్మనపేటకు బయలుదేరాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో నేను, రష్మిక మా ఒక చిన్న కలను ప్రకటించాం. అచ్చంపేట మండలంలోని 9, 10 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. విజయ్ పోస్ట్‌ను రష్మిక రీషేర్ చేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, 'దేవరకొండ ఫౌండేషన్' ద్వారా తుమ్మనపేటలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఫీజులు చెల్లించడం, వారికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. తద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్థిక కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలన్నది వీరి సంకల్పం. ఇక సినిమాల విషయానికొస్తే, వివాహం తర్వాత విజయ్, రష్మిక తొలిసారిగా 'రణబాలి' అనే పీరియడ్ డ్రామా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ జంటకు, 'రణబాలి' మూడో చిత్రం కానుంది. 1850ల నాటి చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లో నమోదుకాని, బ్రిటిష్ వారు తప్పుగా ప్రచారం చేసిన కొన్ని కీలక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం కథ సాగుతుందని సమాచారం.

## ఈటీవీ విన్‌లో మనసును హత్తుకునే 'ఇల్లు'.. స్ట్రీమింగ్ ప్రారంభం

- ఈటీవీ విన్ 'కథా సుధ' సిరీస్‌లో 'ఇల్లు' అనే కొత్త షార్ట్ ఫిల్మ్ విడుదల
- ప్రతి ఆదివారం ఒక లఘుచిత్రాన్ని అందిస్తున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రధాన పాత్రలో హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి
- ఏళ్లుగా ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాల్సి వచ్చిన రచయిత కథ సినిమా ప్రేక్షకులకు ప్రశాంతతను ఇస్తుందన్న చిత్రయూనిట్



ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక 'ఈటీవీ విన్', 'కథా సుధ' పేరుతో అందిస్తున్న లఘు చిత్రాల సిరీస్‌లో భాగంగా ఈ ఆదివారం (జూన్ 14) 'ఇల్లు' అనే కొత్త షార్ట్ ఫిలింను విడుదల చేసింది. ప్రతి వారం ఒక వైవిధ్యభరితమైన కథను ప్రేక్షకులకు అందించే ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ చిత్రం నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ లఘు చిత్రంలో హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి, అనీష్ కురివిల్లా, పవన్ రమేష్ కీలక పాత్రలు పోషించారు. రోహిత్ పెనుమత్స (రాహుల్ రవీంద్రన్) దర్శకత్వం వహించగా, మనోహరి ఆర్ట్స్ బ్యానర్‌పై కిషోర్ మరిశెట్టి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏళ్ల తరబడి అద్దెకు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని యజమాని కోరినప్పుడు, ఒక రచయిత ఎదుర్కొనే మానసిక సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, మనిషికి ఆ ఇంటితో ఉండే అనుబంధాన్ని, జ్ఞాపకాలను ఈ చిత్రం ఎంతో భావోద్వేగభరితంగా ఆవిష్కరిస్తుంది. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ, ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల మనసు ప్రశాంతతతో నిండిపోతుందని పేర్కొన్నారు. ఈ కథ తనను ఎంతగానో కదిలించిందని, రామోజీరావు, రామానాయుడు వంటి మహనీయుల స్ఫూర్తితో దీనిని నిర్మించానని నిర్మాత కిషోర్ మరిశెట్టి తెలిపారు. అర్థవంతమైన కథలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ఈటీవీ విన్ ఈ సిరీస్‌ను కొనసాగిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'ఇల్లు' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## హైదరాబాద్‌లో తమన్ 'ఓజీ' షోకు వరుణుడి దెబ్బ.. చివరి నిమిషంలో రద్దు



- భారీ వర్షాలు, ఈదురుగాలులే కారణంగా రద్దు నిర్ణయం
- రెండోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో తీవ్ర నిరాశ
- హృదయం ముక్కలైందంటూ తమన్ ఎమోషనల్ పోస్ట్
- త్వరలోనే కొత్త తేదీ ప్రకటిస్తామన్న నిర్వాహకులు

ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. తమన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఓజీ టూర్ ఇండియా' (OG Tour India) లైవ్ కన్సర్ట్‌కు భారీ వర్షాలు ఆటంకంగా మారాయి. హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్‌లో శనివారం జరగాల్సిన ఈ కార్యక్రమం ప్రతికూల వాతావరణం కారణంగా చివరి నిమిషంలో వాయిదా పడింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ షోను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా కన్సర్ట్ ప్రాంగణం జలమయమైంది. వర్షం ధాటికి కొన్ని సంగీత పరికరాలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. సాయంత్రం 6:30 గంటలకు షో ప్రారంభం కావాల్సి ఉండగా, వాతావరణం ఏమాత్రం అనుకూలించకపోవడంతో నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ షో రద్దు కావడంపై తమన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ వార్త నా హృదయాన్ని ముక్కలు చేసింది. గత 45 రోజులుగా నా టీమ్‌లోని 56 మంది సభ్యులు ఈ ఈవెంట్ కోసం ఎంతో కష్టపడ్డారు. కానీ మనం ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచింది. ఆయనపై నాకు పూర్తి నమ్మకం ఉంది. అభిమానుల ప్రేమతో మరింత బలంగా తిరిగి వస్తాను" అని ఆయన భావోద్వేగంగా పోస్ట్ చేశారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓజీ' (They Call Him OG) చిత్ర సంగీతాన్ని పురస్కరించుకుని ఈ టూర్‌ను నిర్వహిస్తున్నారు. నిజానికి ఈ కన్సర్ట్ తొలుత జూన్ 6న జరగాల్సి ఉండగా, అప్పుడు కూడా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే వాయిదా పడింది. ఇప్పుడు రెండోసారి కూడా వాయిదా పడటంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. హైదరాబాద్ షోకు సంబంధించి త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తామని నిర్వాహక సంస్థలు ఏసీటీసీ (ACTC) ఈవెంట్స్, క్యాప్‌స్టాక్ (Capstack) వెల్లడించాయి.

## అమరావతిలో బాలయ్య-కొరటాల సినిమా లాంచ్.. ముహూర్తానికి హాజరు కానున్న సీఎం చంద్రబాబు!

- బాలయ్య కొత్త సినిమా పూజా కార్యక్రమాలు జూన్ 25న వెంకటాయపాలెం టీటీడీ ఆలయంలో ముహూర్తం
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్
- ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- హాజరుకానున్న నారా, నందమూరి కుటుంబాలు



నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం (ఎన్‌బీకే112) ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ముహూర్తపు వేడుకను సినీ పరిశ్రమ సంప్రదాయాలకు భిన్నంగా, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చిత్ర బృందం భారీ ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లోని ఫిలిం స్టూడియోలకు బదులుగా, ఏపీ రాజధాని అమరావతిని ఈ వేడుకకు వేదికగా ఎంచుకున్నారు. జూన్ 25న (గురువారం) అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మించిన టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ చిత్ర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం కేవలం సినీ వేడుకలా కాకుండా, ఒక పండుగ వాతావరణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటించే ఈ చిత్ర ముహూర్తపు షాట్‌కు సీఎం చంద్రబాబు నాయుడు క్లాప్ కొట్టనుండగా, మంత్రి నారా లోకేశ్ చిత్ర దర్శకుడు కొరటాల శివకు స్క్రిప్ట్‌ను అందజేస్తారని తెలుస్తోంది. ఈ వేడుకలో నందమూరి, నారా కుటుంబ సభ్యులు పాల్గొననుండటంతో దీనికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సాధారణంగా తన సినిమాల్లో బలమైన సామాజిక సందేశాన్ని వాణిజ్య అంశాలతో జోడించి చెప్పడంలో కొరటాల శివ దిట్ట. ఈసారి బాలకృష్ణ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయేలా ఒక పవర్‌ఫుల్ పొలిటికల్, హై-వోల్టేజ్ సోషల్ డ్రామా కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఈ యాక్షన్ డ్రామాలో బాలయ్య సరసన నటించే కథానాయిక, ఇతర కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ముహూర్తం రోజైన జూన్ 25న అధికారికంగా వెల్లడించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. రాజధాని నడిబొడ్డున జరుగుతున్న ఈ వేడుకపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662